## చరిత్రలో నిలిచిపోయేలా సభ

**బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 28: ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అభివర్ణించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్నటి సభతో కేసీఆర్ వెంటే ఉన్నట్లు రాష్ట్ర ప్రజలంతా నిరూపించారని చెప్పారు. రజతోత్సవ సభ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపిందన్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఐదు వేల మందితో తరలి వచ్చి, సభను విజయవంతం చేసిన గులాబీ సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేసే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, గోపు ఐలయ్యయాదవ్, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, బొడ్డు రవీందర్, ముద్దసాని సంధ్యారెడ్డి, నీరటి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, అచ్చె వేణు, మెతుకు దేవరాజు, నూతి తిరుపతి, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకన్న, ఆవునూరి వెంకటేశ్, కర్రీ ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్.. ఫుల్ జోష్



## రజతోత్సవ సభ సక్సెస్‌తో నూతనోత్సాహం

- చరిత్రలో నిలిచిపోయేలా ఎల్కతుర్తి సభ
- ఉప్పెనలా తరలిన కరీంనగర్ ఉమ్మడిగడ్డ
- ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్న అధినేత కేసీఆర్ ప్రసంగం
- గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- ఇక ఏడాదంతా రజతోత్సవ సంబురాలే
- కాంగ్రెస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైనట్లేనంటున్న విశ్లేషకులు



**పదేళ్ల పచ్చటి కాంతులతో** విలసిల్లిన తెలంగాణ ఏడాదిన్నరలోనే ఏడారిలా మారి.. ఎండ మావులు కనిపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లోనే కాకుండా సబ్బండ వర్గాల్లో నూతనోత్తేజం నింపింది. అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్యుల్లోనూ భరోసా కలిగించింది. పదేళ్ల పాలనలో ఊరూరా జల సిరులు, కల్లాల్లో ధాన్యపురాశులు దర్శనమివ్వగా.. అనతికాల కాంగ్రెస్ పాలనలో ఎండిన చెరువులు, ఎడారులైన వాగులు దర్శనమిస్తున్నాయని వివరించిన తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నది. బీఆర్ఎస్ ప్రస్థానాన్ని వివరిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన తీరు తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేసింది. మొత్తంగా కనీవిని ఎరుగని రీతిలో సకల జనాన్ని కదిలించిన ఈ ఎల్కతుర్తి సభ తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులను తలపించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలిన ప్రజానీకం ఇప్పుడు కేసీఆర్ నామస్మరణ చేస్తున్నది. నాటి పరిస్థితులను గుర్తుకు తెచ్చుకుని ఎవరి పాలన ఎలా ఉందో బేరీజు వేసుకుంటున్నది.

కరీంనగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఏడాదిన్నర పాలనలోనే అంతా తారుమారైంది. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. ఆరు గ్యారెంటీల పరిస్థితి అంతే! సామాన్యులకు భరోసా లేదు! రైతు భరోసా లేదు. రుణమాఫీ పూర్తి కాలేదు. సాగునీరు లేదు. పంట కొనే దిక్కులేదు. పింఛన్‌పెంపు లేదు. తులం బంగారం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఏ ఒక్క వర్గమూ పూర్తి స్థాయిలో సంతోషంగా లేదు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరిలో బీఆర్ఎస్‌ను దూరం చేసుకున్నామనే భావన కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎల్కతుర్తిలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ సామాన్యుల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది. అధినేత కేసీఆర్ ప్రసంగం పార్టీ శ్రేణుల్లోనే కాదు, ప్రజల్లోనూ నూతనోత్సాహం నింపింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఏ విధంగా పురోగమించింది.? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అధఃపాతాళానికి ఎలా పడిపోయింది? అనే చర్చ మొదలైంది. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట ఎన్నో ప్రశ్నలను తెరపైకి తెస్తున్నది. పదేళ్లలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలోకి వచ్చిన తెలంగాణ ఇప్పుడు 14వ స్థానానికి పడిపోయిందని చెప్పిన మాట ప్రజల్లో చర్చకు దారి తీసింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఊరూరా జల సిరులు పారించామని, తద్వారా ప్రతి రైతు చేనులో ధాన్యపు సిరులు విలసిల్లాయని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉన్నదా..? అనే చర్చ జరుగుతున్నది. ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేని అసమర్థ కాంగ్రెస్ పాలనకు కౌంట్ డౌన్ మొదలైనట్లేనని, కేసీఆర్ ఆ పని చేసి పెట్టారని విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు..

### జనప్రవాహం

రజతోత్సవ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి జనం తండోపతండాలుగా కదిలారు. ముఖ్యంగా యువకులు, యువతులు, మహిళలు, విద్యార్థులు, రైతులు, మేధావులు ఇలా ప్రతి వర్గం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినాలనే కుతూహలంతో తరలి వెళ్లారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల అనే తేడా లేకుండా ఆయా జిల్లాల పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి దాదాపు 2లక్షలపైనే జనం వెళ్లారు. ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్ మీదుగా వరంగల్ వెళ్లే దారులన్నీ గులాబీ మయమయ్యాయి. బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు ఇలా ఏ వాహనం దొరికితే ఆ వాహనంపై కార్యకర్తలు, సామాన్య జనం బీఆర్ఎస్ సభకు వెళ్లారు. స్వచ్ఛందంగా తరలిన జనాన్ని చూస్తుంటే కాంగ్రెస్‌పై వ్యతిరేకత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఒక్క పార్టీ కార్యకర్తలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు తండోప తండాలుగా తరలి వెళ్లడం బీఆర్ఎస్‌పై తమకున్న విశ్వాసానికి సంకేతంగా చెప్పవచ్చని అంటున్నారు.

### సరికొత్త స్ఫూర్తి

ఎల్కతుర్తి సభలో కేసీఆర్ చేసిన ప్రసంగం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త స్ఫూర్తిని నింపింది. అధికారం కోల్పోయి ఏడాదిన్నర గడుస్తున్న పార్టీపై కార్యకర్తల్లో ఉన్న అభిమానం ఏ మాత్రం చెక్కుచెదర లేదని ఈ సభ నిరూపించింది. అధికారంలో ఉన్నా, లేకున్నా తామంతా ప్రజల పక్షమే అన్నట్లు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలను కదిలించిన తీరును బట్టి అర్థమవుతున్నది. ప్రజలు తమ వెంటే ఉన్నారని ఈ సభ ద్వారా అధికార పార్టీకి సంకేతాలు పంపినట్టయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యిందని పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగం కార్యకర్తలకు కొత్త ఆయుధాన్ని అందించింది. ప్రజల్లోకి వెళ్లి చెప్పాల్సిన విషయాలన్నింటినీ కేసీఆర్ తన ప్రసంగంలో విపులంగా వివరించారు. బీఆర్ఎస్ ప్రస్థానాన్ని వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. బీజేపీ వైఫల్యాలను కూడా ఎండగట్టారు. అంతే కాకుండా కార్యకర్తలెవరూ నిరుత్సాహ పడొద్దని, ఇంకా రెండున్నరేండ్లే కాంగ్రెస్ పాలన ఉంటుందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చేది తమ పార్టేనని కేసీఆర్ భరోసానిచ్చారు. సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నయా జోష్ కనిపించింది. కరీంనగర్, హుజూరాబాద్‌లో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సభ సక్సెస్ చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు.

### ఏడాదంతా సంబురాలే..

పార్టీ రజతోత్సవాలను ఎల్కతుర్తి సభతోనే సరిపెట్టకుండా ఏడాది పొడువునా నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించింది. ఇటీవల కరీంనగర్‌కు వచ్చిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ విషయాన్ని వెల్లడించారు. వచ్చే నెలలో డిజిటల్ సభ్యత్వ నమోదును చేపడుతున్నారు. ఆ తర్వాత గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కమిటీల ఎన్నికలు నిర్వహించబోతున్నారు. అంతే కాకుండా ప్రతి నియోజకవర్గానికి 500 మంది సుశిక్షితులైన కార్యకర్తలను ఎంపిక చేసి వారికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించబోతున్నారు. ఒక పక్క ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే పార్టీ సంస్థాగత బలోపేతానికి పక్కా ప్రణాళికలు వేసుకున్న బీఆర్ఎస్ ఏడాదంతా రజతోత్సవ సంబురాలను వినూత్న పద్ధతుల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. ఇలాంటి కార్యక్రమాలు కార్యకర్తల్లో నిత్యం ఉత్సాహాన్ని నింపేలా ఉంటాయని అధిష్టానం భావిస్తున్నది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు

# సభతో కాంగ్రెస్‌కు వణుకు

- ఇంత పెద్దగా ఏర్పాటు చేయడం కేసీఆర్‌కే సాధ్యం
- మాలాంటి సభ నిర్వహించే దమ్ముందా?
- కనీసం సగం మందితోనైనా నిర్వహించగలరా..?
- కాంగ్రెస్ మెడలు వంచితేనే రాష్ట్రం వచ్చింది
- తెలంగాణకు ఎప్పటికీ మద్దతుగా ఉండేది బీఆర్ఎస్సే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- సభను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ నాయకులకు వణుకు పుట్టిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. మంత్రులు బెంబేలెత్తిపోయి, గజగజ వణికిపోయి సభ ఫెయిల్ అయ్యిందంటూ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎల్కతుర్తికి వచ్చి ఉంటే వారికి సభ ఎంత పెద్దగా జరిగిందో తెలిసేదని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నాయకులు, మంత్రులకు దమ్ముంటే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో సగం మందితోనైనా సభ నిర్వహించగలరా..? అని సవాల్ చేశారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం సభకు స్కూల్ బస్సులు పంపితే రూ.లక్ష జరిమానా విధిస్తామని రవాణాశాఖ నుంచి మెసేజ్‌లు పెట్టించారన్నారు. ప్రభుత్వం బెదిరించినా.. అనేక సంస్థలు బస్సులను పంపించాయన్నారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించిన రవాణాశాఖ మంత్రికి సిగ్గుండాలన్నారు. సభకు వచ్చే వాహనాలను సైతం ఏ కారణం లేకుండానే ఆపివేశారని, ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో కూడా సమావేశాలు పెట్టే పరిస్థితి లేదన్నారు. వడ్ల కొనుగోళ్ల విషయంలో మంత్రులు ఎందుకు సమావేశాలు పెట్టడంలేదని నిలదీశారు. బీఆర్ఎస్ సభలో తొలి సీఎం కేసీఆర్ ప్రసంగం పూర్తయ్యేంత వరకు ఒక్కరూ కూడా బయటకు పోలేదంటే తమకు ప్రజలు మద్దతు ఏవిధంగా ఉన్నదో తెలిసిపోతుందన్నారు. దేశ చరిత్రలోనే ఓ ప్రాంతీయ పార్టీ ప్రతిపక్షంలో ఉండి కూడా ఇంత పెద్ద సభ ఏర్పాటు చేయడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైందన్నారు. రజతోత్సవ సభకు 95 శాతం యువత, రైతాంగమే వచ్చిందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రేమతో తామంతా అండగా ఉన్నామని చెప్పినట్టు సంఘీభావం తెలుపుతూ తరలివచ్చారన్నారు. బీఆర్ఎస్ సభ కాగానే, పీడకల వచ్చినట్లు ఉలిక్కిపడిన మంత్రులు మీడియా ముందకొచ్చి ఇష్టంవచ్చినట్లు కూతలు కూశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం అప్పుడు, రాష్ట్రం ఏర్పాటైన అప్పుడు పొంగులేటి వైసీపీలో ఉన్నారని, సీతక్క టీడీపీలో ఉన్నారని గుర్తు చేశారు. వీరికి ఉద్యమంతో గానీ, రాష్ట్ర ఏర్పాటుతో గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ స్వచ్ఛందంగా ఇవ్వలేదని, ఆ పార్టీ మెడలు వంచి తెచ్చుకున్నామని తెలిపారు. కేసీఆర్ చేసిన ఉద్యమంతో రాష్ట్రం ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందే తప్పా.. మరొకటి కాదన్నారు. ఇచ్చేవారయితే 60ఏండ్లు ఎందుకు గోస పెట్టించుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ పార్టీకే ఘనత దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజలకు ఎప్పటికి మద్దతుగా ఉండేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. సభ విజయవంతం కావడంతో మంత్రులు ఉలిక్కిపాటుకు గురవుతున్నారని మండిపడ్డారు. మీఫేల్యూర్ మొదలైందని, ఇప్పటికైనా అలర్ట్ అయ్యి వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రయత్నం చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సభను విజయవంతం కోసం ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, మాజీ కార్పొరేటర్ బండారి వేణు, నాయకుడు సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వలేకనే మంత్రుల అక్కసు

బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఒక పండుగ వాతవరణంలో విజయవంతంగా సాగింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కనిపించేలా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. రజతోత్సవ వేడుకలు అన్ని పల్లెల్లోనూ పండుగ వాతవరణంలో జరిగాయి. ఇది ఓర్వలేకే మంత్రులు తమ అక్కసును వెల్లగక్కుతున్నారు. ఏడాదిన్నరలో కాంగ్రెస్ ఏం చేసిందని ప్రజలు అడుగుతున్నవే సభలోనే కేసీఆర్ అడిగారని.. అందులో మంత్రులకు ఏం తప్పు కనిపించిందో చెప్పాలి. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ మొదటి నుంచి విలన్‌గానే ఉన్నది. రాష్ట్రం కోసం ఆనాడు అనేక ఉద్యమాలు, బలిదానాలు జరిగితే తప్పనిసరి పరిస్థితిల్లో తెలంగాణ ఇచ్చారు. ముందు ఇస్తే ఈ బలిదానాలు జరిగేవి కాదు కదా! తెలంగాణ తామే ఇచ్చామని పదేపదే కాంగ్రెస్ నాయకులు చెబుతుంటే ఆశ్చర్యం వేస్తున్నది. కేసీఆర్ ఉద్యమం చేసి ఉండకపోతే తెలంగాణ వచ్చేదా..? కాంగ్రెస్ ఎన్నికల్లో అనేక అబద్ధపు హామీలు ఇచ్చింది. కేసీఆర్‌ను నిదించడం తప్ప హామీలు అమలు చేయాలన్న ఆలోచన మంత్రుల్లో లేదు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే గొప్పగా ఎదిగింది. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో అధోగతికి వచ్చింది. ఇప్పటికీ కూడా ఇచ్చిన హామీలను అమలుచేయకుండా.. అబద్ధాలతోనే కొనసాగుతామనుకోవడం సిగుచేటు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

**- కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి**

## మీ అభిమానం ఇలాగే ఉండాలి

**బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

వేములవాడ, ఏప్రిల్ 28: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో చిరస్థాయిలో నిలిచిపోయాయని చెప్పడానికి ఎల్కతుర్తిలో రజతోత్సవ సభకు తరలివచ్చిన జనసందోహమే నిదర్శనమని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ.. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ముందుకెళ్లేందుకు మీ ఆదరాభిమానాలు ఇలానే ఉండాలన్నారు. సభకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న విశ్వాసం, అభిమానంతో సభకు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లో చిరస్థాయిలో నిలిచిపోయాయన్నారు. సభకు తరలివచ్చి విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## అన్నివర్గాల్లో నూతనోత్సాహం

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మంథని, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఇచ్చిన పవర్‌ఫుల్ స్పీచ్‌తో అన్నివర్గాల ప్రజల్లో నూతనోత్సాహం వచ్చిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హర్షం వ్యక్తం చేశారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రజతోత్సవ సభకు ప్రజలు హాజరుకావద్దనే దురుద్దేశంతో కాంగ్రెస్ సర్కారు.. ఎన్ని ఆటంకాలు కలిగించినా నలుమూలల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా భారీసంఖ్యలో తరలివచ్చారన్నారు. మంథని నియోజకవర్గం నుంచి ఎక్కువగా హాజరుకావద్దని శతవిధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ.. పెద్దసంఖ్యలోనే ప్రజలు హాజరయ్యారన్నారు. తెలంగాణ ప్రజానీకంలో కేసీఆర్ స్పీచ్‌తో నూతనోత్సాహం వచ్చిందన్నారు. వరంగల్‌లో జరిగిన రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రకటించారు.

## ఎన్ని కుట్రలు పన్నినా సభను ఆపలేకపోయారు

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

గంగాధర, ఏప్రిల్ 28: అరచేతిని అడ్డుపెట్టి సూర్యకిరణాలను ఆపలేనట్టు.. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఆపలేకపోయారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభ లక్షలాది మందితో జనసముద్రాన్ని తలపించిందన్నారు. తెలంగాణకు శ్రీరామ రక్ష కేసీఆర్ మాత్రమేనని ప్రజలు గ్రహించారని.. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై అభిమానంతో సభకు తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌ను చుద్దామని, ఆయన ప్రసంగాన్ని విందామని లక్షలాదిగా తరలివచ్చిన జనంతో సభాస్థలం మహాకుంభ మేళా, సమ్మక్క-సారలమ్మ జాతరను తలపించిందన్నారు. కాంగ్రెస్ పాలనతో అయోమయంలో ఉన్న రాష్ట్ర ప్రజలకు.. రజతోత్సవ సభతో నేనున్నానంటూ కేసీఆర్ భరోసా కల్పించారని గుర్తు చేశారు. సభ అట్టర్‌ప్లాప్ అంటూ కాంగ్రెస్ మంత్రులు విష ప్రచారానికి దిగారని, సభను అడ్డుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నించారని విమర్శించారు. లారీలను అడ్డుపెట్టడం, ఆర్టీఏ, పోలీస్ అధికారులతో బెదిరించారన్నారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులు కేసీఆర్‌పై అసత్య ప్రచారాన్ని మానుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## మతిపోయి గాలిమాటలు

**జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**

జగిత్యాల, ఏప్రిల్ 28: రజతోత్సవ సభకు తరలివచ్చిన అశేష జనవాహిని చూసి కాంగ్రెస్ నాయకులు, మంత్రులకు మతిపోయి గాలి మాటలు మాట్లాడుతున్నారని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. రజతోత్సవ సభ కుంభమేళాను తలపించడంతో కాంగ్రెస్ నాయకులు ఆగమైతున్నారని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. సభను విజయవంతం చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే విధంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగిందన్నారు. కేసీఆర్ ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించిందన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నవారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. రజోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, జగిత్యాల రూరల్, అర్బన్, రాయికల్ పట్టణ, మండలాధ్యక్షులు ఆనంద్‌రావు, తుమ్మ గంగాధర్, అనిల్, మల్లేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, రాయికల్ కోఆర్డినేటర్ శ్రీధర్, పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, నాయకులు శీలం ప్రవీణ్, గంగారెడ్డి, రిజ్వాన్, యూత్ నాయకులు ప్రతాప్, ప్రణయ్, మనోజ్, వర్షిత్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

## కుంభమేళాను తలపించింది

**బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభ కుంభమేళా, సమ్మక్క-సారలమ్మ జాతరను తలపించిందని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వంలో సభను దిగ్విజయం చేసుకున్నామన్నారు. సోమవారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభ భారీ సక్సెస్ కావడం, అనుకున్న దానికంటే భారీ సంఖ్యలో జనం తరలిరావడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతున్నదని విమర్శించారు. సభకు వచ్చిన జనాన్ని చూసి మతిభ్రమించి కాంగ్రెస్ మంత్రులు, నాయకులు ఆగమేఘాల మీద ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అవసాన స్థితిలో ఉన్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సాధనలో భాగంగా దేశంలోని దాదాపు 32పార్టీలను ఒప్పించి మద్దతు కూడగట్టిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందే తెలంగాణ రాష్ట్రం కోసం అని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ఉండకపోయి ఉంటే.. రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉండేవాడో కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ఆంధ్ర పాలకులు చంద్రబాబు, యనమల రామకృష్ణుడు బూట్లు తుడిసిన నాయకుడు రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో పని చేస్తున్న మీరు కేసీఆర్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ ఆయన పాలన కోసం ఎదురుచూస్తున్నారని ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదు నిర్వహించి, నూతన కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిపక్ష హోదాలో ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు గుగులోత్ సురేశ్‌నాయక్, కుంబాల మల్లారెడ్డి, మాట్ల మధు, ఒజ్జల అగ్గిరాములు, జక్కుల యాదగిరి, ఇమ్మనేని అమర్‌రావు, గుండు ప్రేమ్‌కుమార్, సయ్యద్ అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.